క్లుప్తంగా

కూలీల శాతం పెంచాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: ఉపాధి హామీ పథకంలో కూలీల శాతం పెంచాలని ఎంపీడీఓ ఎం రంగ సుబ్బారాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి శాఖ టీఏ, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల శాతం తక్కువగా ఉందని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలికి పని కల్పించాలన్నారు. పండ్లతోటలు సాగు చేసుకునే సన్న చిన్న కారు రైతులను గుర్తించాలన్నారు. సాగు చేస్తామని దరఖాస్తు చేసుకున్న రైతులతో మొక్కలు నాటించాలన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంటలు తీసేలా చూడాలన్నారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, టీఏలు తిరుపతమ్మ, వెంకట్రావు, రజిని పాల్గొన్నారు.

మద్యం తాగి అలజడి సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: గ్రామాల్లో బహిరంగంగా మద్యం తాగి వీధుల్లో, రోడ్లపై అలజడి సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ వద్ద, టీ దుకాణాల వద్ద గుంపులుగా ఉన్న వారితో, వాహనదారులతో ఎస్సై మాట్లాడారు. వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించినా, మద్యం తాగి అతిగా ప్రవర్తించినా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

తల్లిదండ్రుల సమావేశం పండుగలా నిర్వహించాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో ఈ నెల 7వ తేదీ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో హెల్త్, భోజన, శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.నాగేంద్రవదన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకం




పంచగవ్యను తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమని యూనిట్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో మండలంలోని మర్లపాడులో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచగవ్యను తయారు చేసి రైతులకు దాని ఉపయోగాలను వివరించారు. పంటలో నాణ్యత, అధిక దిగుబడి సాధించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హరిత, సుజాత, మరియమ్మ, జ్యోష్న, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

ఉలవపాడు: మామిడి రైతులకు స్థానిక ఉలవపాడు-2వ రైతు సేవా కేంద్రంలో శిక్షణ నిర్వహించనున్నట్లు మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని రైతులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలి



కరేడులో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ రమేష్

ఉలవపాడు: ప్రజారోగ్యంపై వైద్య సిబ్బంది శ్రద్ధ వహించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఓ రమేష్ అన్నారు. కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరేడు-1 వ సచివాలయంలోని రికార్డులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు అన్ని రకాల సేవలందించాలని, హై రిస్క్ గర్భిణులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలను పుస్తకాల్లో నమోదు చేస్తున్నారా లేదా పరిశీలించారు. వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. టాస్క్‌ఫోర్స్ డీపీఏ షైనీ, కరేడు వైద్యాధికారి శ్రీనివాసరావు, పీహెచ్‌ఎన్ సీతారాములు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రిడ్జి లేని ఉత్తర బైపాస్



బ్రిడ్జి నిర్మించని కరేడు ర్యాంపు

హైవేపై భయం..భయం..

- అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో నిత్యం ప్రమాదాలే
- మలుపు తిరగాలంటేనే భయపడుతున్న వాహనదారులు
- ప్రజల విజ్ఞప్తిని పట్టించుకోని అధికారులు
- నిత్యం ఏదో ప్రాంతంలో తప్పని ప్రమాదాలు



ఉలవపాడు లోపలకి రావాలంటే భయమే

ఉలవపాడు:

మండల పరిధిలోని జాతీయరహదారిపై ప్రయాణం అంటేనే భయం భయంగా మారింది. ప్రధానంగా సింగరాయకొండ నుంచి తెట్టు మధ్య ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. దీనికి ప్రధానంగా గ్రామాల వద్ద జాతీయరహదారిపై అండర్ పాస్ బ్రిడ్జి లు నిర్మించకపోవడమే. ఉలవపాడు మండల పరిధిలో ఉన్న గ్రామాలకు హైవేపై అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు మలుపు తిరుగుతూ, గ్రామాల నుంచి వాహనాలు హైవే మీదకు వచ్చే సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జిలు నిర్మించాలని వివిధగ్రామాల ప్రజలు హైవే అధికారులకు వినతిపత్రాలు అందించినా ఉపయోగం లేకుండా పోయింది. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం బ్రిడ్జిలు నిర్మించకపోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు.

బ్రిడ్జిలు నిర్మించకపోవడం వల్లే....

జాతీయ రహదారిపై అండర్ పాస్ బ్రిడ్జిలు నిర్మించకపోవడం వల్లే ఈ ప్రమాదాలుజరుగుతున్నాయి. ఉలవపాడు మండల పరిధిలోనే బ్రిడ్జిలు నిర్మించలేదు. బ్రిడ్జిలు నిర్మాణం జరగాల్సిన వీరేపల్లి జంక్షన్, రాజుపాలెం జంక్షన్, ఉలవపాడు ఉత్తర బైపాస్, ఉలవపాడు దక్షిణ బైపాస్, మన్నేటికోట రోడ్డు జంక్షన్, కరేడు ర్యాంపు జంక్షన్ వద్ద అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కరేడు గ్రామానికి వెళ్లే ర్యాంపు వద్ద బ్రిడ్జి నిర్మించలేదు. ప్రధానంగా రాజుపాలెం జంక్షన్ నుంచి భీమవరం, బద్దిపూడి, కృష్ణాపురం, గుడ్లూరు మండలాలకు వాహనాలు వెళ్తుంటాయి. అయినా అక్కడ కూడా నిర్మించలేదు. మన్నేటికోటకు వెళ్లే జంక్షన్‌వద్ద కూడా బ్రిడ్జిని నిర్మించలేదు. వీరేపల్లి వద్ద మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం చిన్నబ్రిడ్జిని నిర్మిస్తామని మాజీ కలెక్టర్ విజయకుమార్ అప్పట్లో ప్రకటించినా నిర్మాణం జరగలేదు. ఇక మండల కేంద్రమైన ఉలవపాడులోకి బైపాస్ నుంచి లోపలికి రావాలన్నా బ్రిడ్జిలు లేవు. దీంతో టౌన్‌లోకి రావాలంటేనే వాహనదారులు భయపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికారులు గుర్తించి అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతున్నారు.



ఇటీవల మన్నేటికోట రోడ్డు వద్ద ప్రమాదం (ఫైల్)

ఇటీవల జరిగిన ప్రమాదాలివి

- నవంబరు 28న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో మాల్యాద్రి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.
- నవంబరు 19న మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద మలుపుతిరుగుతున్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి.
- నవంబరు 3న ఉలవపాడు ఉత్తర బైపాస్‌లో ద్విచక్రవాహనాన్ని మినిలారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారునికి గాయాలయ్యాయి.
- అక్టోబరు 14న ఉలవపాడు దక్షిణ బైపాస్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో లారీ డ్రైవర్ మృతి చెందాడు.
- అక్టోబరు 13న ఉలవపాడు దక్షిణ బైపాస్ వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న పూజారిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి.
- అక్టోబరు 5న వీరేపల్లి జంక్షన్ వద్ద లారీని తుఫాన్ వాహనం ఢీకొనడంతో ఏడుగురికి గాయాలయ్యాయి.
- సెప్టెంబరు 7న వినాయక విగ్రహ ట్రాక్టర్‌ను ట్రిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి.
- సెప్టెంబరు 1న కరేడు ర్యాంపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



హనుమంతాపురంలో అలసంద పంటను పరిశీలిస్తున్న అధికారులు



అగ్రహారంలో వర్షానికి పడిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్



పడమటి కట్టకిందపల్లెలో కంది పైరును పరిశీలిస్తున్న ఏఓ రాధ

హనుమంతునిపాడు: విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ అవుతుందని ఏఓ కె.రమణ అన్నారు. మండలంలోని హనుమంతాపురం, వెంకట్రాయునిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. అలసంద, మినుము, పొగాకు, పండ్ల తోటల సాగు, నిమ్మ తోటలను పరిశీలించారు. తెగుళ్లను పరిశీలించి యాజమాన్య పద్ధతులు వివరించారు. సాగు చేసిన మినుము, వరి, కంది, వేరుశనగ బీమా చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి ఎం అంజలీబాయి మాట్లాడుతూ జామ, దానిమ్మ, నిమ్మ తోటలకు ఆశించే తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఈఇఓ గోపీక్రిష్ణా, వీఏఏలు సుప్రజ, సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): వర్షం నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అప్రమత్తతతో పంటలు కాపాడుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్, ఉద్యానవన శాఖాధికారి కె.కుసుమ అన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల దృష్ట్యా బుధవారం ఏఓ సంపత్‌కుమార్ మండలంలోని అగ్రహారం, రేగులచెలక, చెన్నపునాయునిపల్లె గ్రామాల్లోని వరి, కంది, శనగ, జొన్న పంటలు, వరి నారుమళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాటేముందు నారు కొసలు తుంచి నాటాలని, తద్వారా కాండం తొలుచుపురుగు గుడ్లను నివారించవచ్చన్నారు. చింతపూడులో నీరు నిలిచిన మిర్చి పైరును క్షేత్రస్థాయిలో పరిశీలించిన హెచ్‌ఓ కే.కుసుమ రైతులకు పలు సూచనలు చేశారు.

పామూరు: రైతులు తాము సాగు చేసిన పంటల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలని వ్యవసాయాధికారి కంచం రాధ పేర్కొన్నారు. ఫెంగల్ తుఫాన్ కారణంగా మంగలంలో గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పడమటి కట్టకిందపల్లె, దాదిరెడ్డిపల్లె గ్రామాల్లో పంట స్థితిగతులు పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ శనగ వారం నుంచి 10 రోజుల దశలో ఉందని, ఎండలు వచ్చి ఆరేకొద్ది మొక్క చనిపోయే అవకాశం ఉందని జిల్లా అధికారులకు తెలిపామన్నారు. రైతులు పంటల్లో నీరు నిల్వలేకుండా కాల్వల ద్వారా బయటకు పంపేలా చూసుకోవాలన్నారు.

పీసీపల్లి: మండలంలోని పెదయిర్లపాడు, వెంగలాయిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.ప్రకాష్‌రావు మాట్లాడుతూ కంది, మినుములో వాతావరణ మార్పులతో చీడపీడలు ఆశిస్తాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ సహాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, ఏఈఓ పుల్లయ్య పాల్గొన్నారు.

15 లోగా పంటల బీమా చేయించుకోవాలి

మర్రిపూడి: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 15వ తేదీ లోగా బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. మండలంలోని గుండ్లసముద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి సంధ్య మాట్లాడుతూ మిరపకు ఆకుముడత, తెల్లదోమ ఆశించిందని, అధికారుల సూచనల మేరకు పంటలపై మందులు పిచికారీ చేయాలన్నారు. రఘువీర, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కొండపి: వర్షాల కారణంగా పొగాకులో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు, వెంకన్నపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుకుళ్లు నివారణకు బ్లై టాక్స్ 3గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు డి. విజయలక్ష్మి, కొండలరావు, రైతులు పాల్గొన్నారు.



పీసీపల్లి: మినుము పంటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



గుండ్లసముద్రంలో సూచనలిస్తున్న ఏఓ వెంకటేష్



పొగాకు పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

6 నుంచి రెవెన్యూ సదస్సులు

పీసీపల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. 6న చింతగంపల్లి, 7న వెలుతుర్లవారిపల్లి, 10న గుంటుపల్లి, తురకపల్లి, 11న పెద అలవలపాడు, 12న గుదేవారిపాలెం, రామాపురం, 13న తలకొండపాడు, 16న శంకరాపురం, 17వ తేదీ లక్ష్మక్కపల్లి, 18 రామగోవిందాపురం, 19 విశలాపురం, 20 మురుగమ్మి, 21 నేరేడుపల్లి, 23 వేపగుంపల్లి, 24 ముద్దపాడు, 26 బట్టుపల్లి, 27 పోతవరం, 28 చౌట గోగులపల్లి, 30 పెదయిర్లపాడు, అడవిలోపల్లి, 31 పెదయిర్లపాడు, గుంటూరు లింగన్నపాలెం, జనవరి 2 పెదచెర్లోపల్లి, జనవరి 3 కమ్మవారిపల్లి, పెద్ద చెర్లోపల్లి, 4 పెదవరి మడుగు, 6వ తేదీ గోసి గుండాలు, 7న పిచ్చిగుంటపల్లి, 8న మారెళ్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సింగరాయకొండ: సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు టి.రవి, బి.జనార్దన్‌లు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ రెవిన్యూ సదస్సులలో రెవిన్యూ సంబంధించిన అన్ని రికార్డులను సరిచేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కో ఆపరేటివ్ బ్యాంకులో విచారణ

కొండపి: స్థానిక కో ఆపరేటివ్ బ్యాంకులో అవకతవకలు జరిగినట్లు పెరిదేపికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం స్థానిక విచారణ చేపట్టినట్లు పీడీసీసీబీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జమీల్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిదేపికి చెందిన ఒక వ్యక్తి బ్యాంకులో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు చేయగా, స్థానిక బ్యాంకుకు వచ్చి విచారణ చేపట్టానని, విచారణలో భాగంగా ఫిర్యాదుదారునికి ఫోన్ చేయగా, అతను అందుబాటులోకి రాలేదన్నారు. అయితే వచ్చిన ఫిర్యాదు ఆధారంగా నెన్నూరుపాడుకు చెందిన వారిని బ్యాంకుకు పిలిపించి విచారించామన్నారు. అయితే విచారణలో వారు బ్యాంకుకు వచ్చి తాము రుణం తీసుకున్నామని చెప్పారని తెలిపారు. మరొకసారి బ్యాంకుకు ఫిర్యాదుదారుని పిలిపించి విచారిస్తామని చెప్పారు.



పార్టీ నేతలతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: పార్టీ అభివృద్ధికి అందరం సమష్టిగా ముందుకు సాగుదామని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం పార్టీ నేలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలని ప్రజలకు వివరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఫలాలు దూరమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామ గ్రామాన ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు.

త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామ, పట్టణ, మండల కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అందరి సహకారంతో పార్టీలోని అందరితో చర్చించి కార్యచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు, గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఓకే రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, ఆవుల భాస్కర్‌రెడ్డి, భువనగిరి వెంకటయ్య, బి.కొండారెడ్డి, ఎక్కుండి శ్రీనివాసులరెడ్డి, వి.రాజశేఖరరెడ్డి, కటికల వెంకటరత్నం, శేఖర్, సానికొమ్ము మధు, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరులో ఓ మోస్తారు వర్షం



కల్లూరివారిపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పాలేరు

పొన్నలూరు: ఫంగల్ తుఫాన్ ప్రభావంతో పొన్నలూరు మండలంలో బుధవారం ఓమోస్తారు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని వాగులు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. అడపాదడపా ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉండటంతో గ్రామాల్లోని వీధులన్నీ జలమయం కావడంతో పాటు పంట పొలాలు, వాగులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. కల్లూరివారిపాలెం, కె. అగ్రహారం మధ్యలోని పాలేరు నది వర్షం నీటితో ఉధృతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పొగాకు, మిరప పంటలకు అనుకూలంగా ఉండగా, మినుము, పూత దశలో ఉన్న కంది పంటలకు నష్టం చేకూరుతుందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



పొన్నలూరులో పొగాకు తోటలోని వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతు

నూతన వధూవరులకు దద్దాల ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న దద్దాల, ఇతర నేతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ఆనికాలపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు, ఆనికాలపల్లి సర్పంచ్ చెరుకుపల్లి రాధాక్రిష్టారెడ్డి రత్నమ్మల కుమారుడు హరిక్రిష్టారెడ్డి, శ్రావణిల వివాహం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. వివాహానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ హాజరైన నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, జెడ్పీటీసీలు మేకల శ్రీనివాసయాదవ్, గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, ముత్యాల భారతీనారాయణరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్లు బోయళ్ల నారాయణరెడ్డి, బైరెడ్డి జయరామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, ముడుమాల నారాయణరెడ్డి, ఓకేరెడ్డి, పార్టీ సచివాలయ కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తదితరులు ఉన్నారు.

రాళ్లపాడు నీటిమట్టం 18.9 అడుగులు



18.9 అడుగులకు చేరుకున్న రాళ్లపాడు నీటిమట్టం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 18.9 అడుగులకు చేరినట్లు జేఈ చంద్రమౌళి తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టుకు నీరు చేరుతున్నట్లు చెప్పారు. ఉప్పుటేరు, మన్నేరు, పిల్లాపేరుల నుంచి 200 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20 అడుగులకు చేరుకోగానే కొత్త స్పీల్‌వే ద్వారా మన్నేరుకు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున పశువులు, గొర్రెలు కాపరులు, రైతులెవ్వరూ కూడా మన్నేరు వైపునకు వెళ్లవద్దన్నారు. మన్నేరు పరీవాహక ప్రాంత గ్రామాల్లోని రైతులు తమ విద్యుత్ మోటార్లను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

దివ్యాంగులను వృత్తి విద్య వైపు ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మల్లికార్జున

వలేటివారిపాలెం: దివ్యాంగ విద్యార్థులను వృత్తి విద్య వైపు ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారి మల్లికార్జున అన్నారు. మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను వృత్తి విద్య వైపు తీసుకు వెళితే వారి కాళ్లపై వారు నిలబడి సాధారణ విద్యార్థులకు పోటీగా ఉంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కమలాకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు మానసిక పరివర్తన, వారి అలవాట్లను పెంపొందించడం ద్వారా వారి అభ్యున్నతికి పాటుపడవచ్చన్నారు. అనంతరం వారికి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీచర్స్ వి.రవి, జి.దివ్య, జాన్సన్ పాల్గొన్నారు.

భూములు ఆరిన తర్వాతే శనగ విత్తుకోవాలి

కందుకూరు రూరల్: ప్రస్తుతం వర్షాలు పడి భూములు తడిగా ఉన్నందున భూములు ఆరిన తర్వాతే శనగ విత్తుకోవాలని వ్యవసాయాధికారి వి.రాము రైతులకు సూచించారు. మండలంలోని పాలూరు, దొండపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగ విత్తనాలను విత్తనశుద్ధి చేసుకొని మాత్రమే విత్తుకోవాలని తెలిపారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పైరులో నిల్వ నీటిని కాలువల ద్వారా బయటకు పంపించాలని సూచించారు. రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. వరిపంట పొలాలను పరిశీలించి వరిలో యూరియా వాడకాన్ని మోతాదుకు మించి వాడకూడదని సూచించారు. వ్యవసాయ మార్కెట్ పర్యవేక్షకులు షేక్ ఖాసీం, రైతులు పాల్గొన్నారు.